క్లుప్తంగా

40 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెనుగొండ: పెనుగొండ పంచాయతీలో స్కోజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 40 మంది కంటి పరీక్షలు చేయించుకున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ తెలిపారు. మంగళవారం ఉదయం స్కోజో ఫౌండేషన్ డాక్టర్ జి.అజోరీ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించామని తెలిపారు. ఆప్తమాలజిస్ట్ ఎం.విజయ్ కుమారి, పీఆర్‌ఓ బి.వెంకటరమణ శిబిరంలో వైద్య సేవలందించారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు అందించారు. 20 మందికి సబ్సిడీపై కళ్లజోళ్లు అందించినట్లు తెలిపారు. ఏడుగురికి శస్త్ర చికిత్స అవసరమైనట్లు గుర్తించామని వైద్యులు తెలిపారు. వీరికి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి సిపారుసు చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు, గ్రామ కార్యదర్శి టి.రత్నాకరరావు, డీఎం మహంతి, జి.భార్గవనాయుడు పాల్గొన్నారు.

మొగల్తూరు డీటీగా నరేష్‌కుమార్



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

మొగల్తూరు: మొగల్తూరు డిప్యూటీ తహసిల్దార్‌గా జి.నరేష్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గత ఫిబ్రవరి వరకు మొగల్తూరు డీటీగా విధులు నిర్వహించిన ఆయన అనంతరం పాలకోడేరు డీటీగా బదిలీపై వెళ్లారు. ఎన్నికల అనంతరం నోటిఫికేషన్ ఎత్తివేయడంతో తిరిగి పాలకోడేరు నుంచి మొగల్తూరు డీటీగా బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉత్తర్వులు జారీ చేయడంతో తహసీల్దార్ భాష్కర్‌కు నియామక పత్రాలు అందచేసి బాధ్యతలు స్వీకరించారు. నరేష్‌కుమార్‌ను పలువురు వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఇప్పటి వరకు డీటీగా విధులు నిర్వహించిన కె.సూర్యనారాయణ రాజు పాలకోడేరు డీటీగా బదిలీ అయ్యారు.

భక్తి శ్రద్ధలతో వాసవీ హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోపి వాసవీ శాంతిధాంలో మంగళవారం వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన వాసవీ భక్తులు 102 రుషీ గోత్ర మందిరంలో వాసవీ మాత పంచలోహ విగ్రహాన్ని దర్శించుకొని మరకత శిల వాసవీ మాతకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో వాసవీ శాంతిధాం యాగశాలలో వాసవీ హోమం నిర్వహించారు. పూర్ణాహుతి సమర్పించి వాసవీ పారాయణ చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రులు



పేరుపాలెం మోళ్లపర్రు బీచ్‌లో వారాహి అమ్మవారి హోమంలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: మోళ్లపర్రు కనకదుర్గ బీచ్‌లో వేంచేసియున్న దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో వారాహి నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. నిత్యార్చన పూజా కార్యక్రమంలో అమ్మవారి సన్నిధిలో ఆలయ అర్చకులు ప్రవీణ్ కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో పండితులు నక్షత్ర హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. నాగిడి రంగారావు, ఆముదాలపల్లి సుబ్రమణ్యం, సత్తినేని సర్వేశ్వరరావు, మేకం రంగనాథ్ దంపతులు, నేదునూరి శ్రీనివాస్, అయితం రామకృష్ణ, తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వాహనాల వేలం

ఆకివీడు: మద్యం అక్రమ అమ్మకాల్లో పట్టుపడ్డ మూడు వాహనాలను స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద మంగళవారం బహిరంగ వేలం వేశారు. ఈ వేలం ద్వారా రూ.61,420 ఆదాయం వచ్చినట్లు స్థానిక సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.కాత్యాయని చెప్పారు. జిల్లా ఏఈఎస్ ఆర్సీహెచ్ చిట్టిబాబు ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా ఎస్సై యుగంధర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

అనుమానం వ్యక్తం చేస్తున్న యువత



మొగల్తూరు: నిరుద్యోగభృతిపై గంపెడు ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు. దీంతో నిరుద్యోగ భృతిపై స్పష్టత లోపించింది. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని అధికారంలోకి రాకముందు ప్రకటించిన చంద్రబాబు నెలరోజులైనా నిరుద్యోగ భృతిపై మాట్లాడకపోవడంతో యువత అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత మాట్లాడకపోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం, లేదా ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తాం. అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ భృతి గురించి మాట్లాడకపోవడం నిరుత్సాహానికి గురి చేస్తుందని పలువురు నిరుద్యోగులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ భృతి రూ.3 వేలు వెంటనే అమలు చేయాలని పలువురు నిరుద్యోగులు కోరుతున్నారు.

స్పష్టత ఏది?



అధికారంలోకి రాకముందు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా నిరుద్యోగ భృతిపై స్పష్టత లేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తారో లేదో స్పష్టంగా చెప్పాలి. గతంలో బాబు వస్తే జాబు అన్నారు. ఇప్పుడేమో బాబు వస్తే డబ్బులు అంటూ అధికారంలోకి వచ్చారు. ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. – పిప్పళ్ల శ్రీనివాస్, రామన్నపాలెం, మొగల్తూరు మండలం

నాయకులు స్పందించాలి



ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా నిరుద్యోగ భృతి ఊసెత్తడం లేదు. నిరుద్యోగ భృతిపై నాయకులు స్పందించాలి. గతంలోనూ ఇలానే నిరుద్యోగ భృతి ఇస్తామని గడిపేశారు. కనీసం ఈ సారైనా ఇచ్చిన మాట నిలబెట్టుకొని నిరుద్యోగ యవతను ఆదుకోవాలి. చదువుకున్న వారమంతా మీరిచ్చే నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం.

– పేరుపాలెం శ్రీనివాస్, మొగల్తూరు

మానవత సేవలు అభినందనీయం



విద్యార్థినిని సత్కరిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పెనుగొండ: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని, వీటి వలన సమాజానికి ఎంతో మేలు కలుగుతుందని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. మంగళవారం పెనుగొండ మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో ఎస్వీకేపీలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించి డెస్క్‌టాప్, ఇతర బహుమతులు అందించారు. ఏపీ కెరీర్ గైడెన్స్ కన్వీనరు డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి మాట్లాడుతూ విద్యార్థులు సేవా భావం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, సమాజానికి సేవ చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎస్వీకేపీ విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, పెనుగొండ మండల అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయరాజు, తణుకుశాఖ అధ్యక్షురాలు కటారి శారదా దేవి, డాక్టర్ కె.రామలక్ష్మి, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణ మూర్తి, నేమాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ సత్యసౌజన్య

పాలకొల్లు అర్బన్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తారని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యసౌజన్య అన్నారు. పాలకొల్లు మండలం సబ్బేవారిపేటలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గర్భిణులు, రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో నీరు కలుషితం కావడం వలన వాంతులు, విరోచనాలకు గురవుతుంటారని, శరీరంలో నీటిశాతం తగ్గకుండా ఓఆర్ఎస్ తీసుకోవాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, దివ్య, హెల్త్ అసిస్టెంట్ ఏవీఎస్ నాగరాజు, అంగన్‌వాడీ వర్కర్ పద్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రామకృష్ణ సేవలు చిరస్మరణీయం



రామకృష్ణకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: ప్రజల కోసం పని చేసిన నాయకులు ఎపుడూ ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోతారని అలాంటి వారిలో మాజీ సర్పంచ్ రామకృష్ణ ఒకరని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ అన్నారు. మంగళవారం వల్లూరులో మాజీ సర్పంచ్ చిట్టూరి రామకృష్ణ 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ చిట్టూరి రామకృష్ణ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వల్లూరు సర్పంచ్‌గా గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చిట్టూరి రాంబాబు, సీపీఎం నాయకులు బొర్రా ధర్మారావు, తాళం సుబ్బారావు, పి.మోహన్ రావు, దేవల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగాన్ని నిషేధించాలి

ఆకివీడు: పొగాకు తినడం, నమలడం, తాగడం అనారోగ్యమని, తీవ్ర రుగ్మతలకు లోనవుతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని అజ్జమూరు గరువులోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పొగాకు వినియోగాన్ని నిషేధించండి, ఉప ఉత్పత్తుల్ని రద్దు చేయండి అని నినాదాలు చేశారు. పాఠశాల హెచ్‌ఎం విక్రమ్ మాట్లాడుతూ గుట్కా, పాన్‌పరాగ్, ఖైనీ, జర్దా, సిగరెట్‌లు, చుట్టల వల్ల అనారోగ్యానికి గురవుతారన్నారు. హెడ్‌కానిస్టేబుల్ బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం

● వర్షాలకు ఛిద్రమవుతున్న రహదారులు
● జారి పడుతున్న ప్రయాణికులు



దమ్ము చక్రాల ట్రాక్టర్‌లు తిరగడంతో ధ్వంసమైన రహదారి



దమ్ముచక్రాలతో తిరుగుతున్న ట్రాక్టర్



పెనుగొండ సీతారామ పేటలో అధ్వానంగా మారిన రహదారి

పెనుమంట్ర: వేసవిలో ట్రాక్టర్ ట్రక్కులు, లారీలపై మట్టి రవాణా ద్వారా, వర్షాకాలంలో దమ్ము చక్రాలతో రోడ్లపై ట్రాక్టర్‌లను నడపడం వలన గ్రామీణ రోడ్లు ఛిద్రమవుతున్నాయి. పెనుమంట్ర మండలంలో వాహన యజమానులు, డ్రైవర్లు ట్రాక్టర్లపై అక్రమ మట్టి రవాణా చేస్తున్నా, దమ్ము చక్రాలతో రోడ్లపై నడుపుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆర్‌అండ్‌బీ, జిల్లా పరిషత్ రోడ్లతోపాటు గ్రామాలలోని పంచాయతీ సిమెంట్ రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. చినుకు పడితే వర్షాకాలంలో ప్రయాణికులు రోడ్లపై వెళ్లడానికి నానా ఇబ్బందులు పడటమే కాకుండా తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలవుతున్నారు. మండలంలో ఈ పరిస్థితి శివారు గ్రామాలైన వెలగలవారిపాలెం, జుత్తిగ, మల్లిపూడి, ఎస్.ఇల్లిందలపర్రు, మాముడూరు, పోలమూరు, నెలమూరు, భట్ల మగుటూరు, కొయ్యేటిపాడు సత్యవరం గ్రామాల్లో అధికంగా ఉంటుంది. వర్షం పడితే ఈ గ్రామాల వైపు ప్రయాణం చేయాలంటే ద్విచక్ర వాహనదారులకు వణుకు పుడుతోంది. వేసవిలో అధిక లోడుతో ట్రాక్టర్‌లపై మట్టి రవాణా చేయడంతో మట్టి జారిపడి వేసవిలో దుమ్ముగాను, వర్షాకాలంలో బురదమయంగా మారి రోడ్లు అధ్వాన్నంగా మారుతున్నాయి. వర్షాకాలంలో సార్వా నారుమడులు ప్రారంభం నుంచి వరి నాట్లు పూర్తయ్యే వరకు ట్రాక్టర్లు దమ్ము చక్రాలతో రోడ్లపై తిరగడం వలన రోడ్లు మరింత అధ్వాన్నంగా మారి, ప్రయాణికులను ఆసుపత్రి పాలు చేస్తున్నాయి. దీంతో కొందరు వికలాంగులుగా మారడం, మరి కొందరు చికిత్స పొందుతూ మృత్యువాత పడిన సంఘనలు అనేకం ఉన్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా మట్టి రవాణా చేస్తున్న వారిపై, దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్డుపై తిరుగుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారులు ఛిద్రం

పెనుగొండ: భారీ వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు బురద మయంగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు, గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. సిద్ధాంతంలో గోదావరి రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. కోడేరు బ్యాంకు కెనాల్ వరకూ సీసీ రహదారి నిర్మించి వదలి వేయడంతో కోడేరు బ్యాంకు కెనాల్ లాకుల నుంచి కేధారీఘాట్ వరకూ చినుకు పడితే చాలు జారుడు బల్లలా మారుతుంది. ఏమాత్రం ఆదమరిచినా బోల్తా కొట్టడం ఖాయం. కేధారీఘాట్ పుణ్య ఘట్టంగా పేరు గాంచడంతో నిత్యం వందలాది మంది వస్తుంటారు. దీనికి తోడు మధ్య లంకలోకి రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరి అవస్థలు వర్ణనాతీతం. రహదారి నిర్మాణం చేపట్టి ఆదుకోవాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే పరిస్థితి పెనుగొండ బస్టాండ్ సమీపంలోని సీతారామపేటలోనూ నెలకొంది. నిత్యం బస్టాండుకు రాకపోకలు సాగించడానికి పెనుగొండ ప్రజలు ఈ రహదారినే వినియోగిస్తుంటారు. ఈ రహదారిపై మోకాలు లోతు మట్టిలో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షాలతో రోడ్లు ధ్వంసం

నరసాపురం: గత వారం రోజులుగా విస్తృతంగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలో రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే అధికంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో రోడ్లపై వర్షపు నీరు నిలువ ఉండిపోతుంది. అధిక వర్షాలకు పట్టణంలోని స్టీమర్ రోడ్డు, గడ్డిబజార్, అన్నపూర్ణ థియేటర్, బస్టాండ్ పక్క వీధి రోడ్లు ధ్వంసమయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి పరిస్థితి చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణాభివృద్ధికి కృషి చేయాలి

పెనుమంట్ర: అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి (వాసు) అన్నారు. మంగళవారం పెనుమంట్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు మరో రెండున్నర సంవత్సరాల పదవీ కాలం ఉందని, ఈ సమయంలో ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగాలన్నారు. ముఖ్య అతిథి జడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణీ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలని, తదుపరి పార్టీలకతీతంగా ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యుత్ శాఖ పనితీరుపై ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. గ్రామ సర్పంచ్, కార్యదర్శి సమక్షంలో పని చేయాల్సిన లైన్‌మెన్‌లు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సి.పద్మజ, తహసీల్దారు కె.లక్ష్మీకల్యాణి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వాసంశెట్టి కిరణ్‌కుమార్, ఈది అనిత ప్రవీణ్, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు తమనంపూడి వీర్రెడ్డి, గూడూరు దేవేంద్రుడు, బుర్రా రవికుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత



ప్రభుత్వాసుపత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కాళ్ల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యుడు సరాబు సునీల్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం డెంగి మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. కొబ్బరిబొండాలు, వాడేసిన టైర్లు, ఇళ్ల ఆవరణలో నీరు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెందుతాయని, దీంతో మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు విజృంభించే ప్రమాదముందని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా స్ప్రేయింగ్ చేయించుకోవాలన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే పీహెచ్‌సీని సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ వద్ద క్షయ వ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీఎస్ బీ సుజనా, ఎస్టీఎల్‌ఎస్ కే చంద్ర దొరరెడ్డి వైద్య సిబ్బందికి శిక్షణ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ డీ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రశంసాపత్రాలు

భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో పోలీసులతోపాటు ఎన్‌సీసీ క్యాడెట్లు అందించిన సేవలు అభినందనీయమని డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు అన్నారు. ఎన్నికల్లో సేవలందించిన ఎన్‌సీసీ క్యాడెట్లకు మంగళవారం ప్రశంసాపత్రాలను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఓటు నమోదు నుంచి కౌంటింగ్ వరకు ఎన్‌సీసీ క్యాడెట్లు సహాయ సహకారాలు అందించడం గొప్ప విశేషమన్నారు. ప్రిన్సిపాల్ జి.మోజేష్ మాట్లాడుతూ జాతీయ కార్యక్రమాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు సేవలందించడం ఆదర్శనీయమన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి డీఎన్నార్ ఎన్‌సీసీ క్యాడెట్లు మూడు నెలలపాటు ఓటు నమోదు నుంచి కౌంటింగ్ వరకు పోలీసు శాఖకు ఎంతో సహకరించిన 26 మందికి ప్రశంసా పత్రాలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు నర హరిశెట్టి కృష్ణ, పి.రామకృష్ణంరాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ వీరయ్య పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పలువురికి కొలువు



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావు



నియామక పత్రాలు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

పాలకొల్లు అర్బన్: విద్యాభ్యాసం పూర్తి చేసిన అనంతరం ఉద్యోగ అన్వేషణలో నిరుద్యోగుల కోసం పలు కంపెనీలతో యాజమాన్యం మాట్లాడి తమ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఛాంబర్స్ కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావు అన్నారు. కళాశాలలో మంగళవారం ట్విన్కోటెక్, ఇన్ఫోల్యూమీ, హ్యాపెక్ కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ కంపెనీల ఇంటర్వ్యూల్లో ఎంపికైన 16 మందిని చైర్మన్ నరసింహరావు ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ యు.జానకిరామయ్య, టి మీనా, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విద్యార్థులకు టీసీఎస్‌లో ఉద్యోగాలు

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు టీసీఎస్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఏఐ అండ్ ఎంఎల్ విభాగంలోని విద్యార్థులు అనంతపల్లి జాహ్నవి శ్రీనిఖిల, నార్కెడమిల్లి నాగ ధనలక్ష్మి వీరిరువురు రూ.7 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్‌లు అడ్డాల శ్రీహరి, పులపర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.గోపీచంద్, ఏఐ అండ్ ఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ బొమ్మా రామకృష్ణ ఉద్యోగాలకు ఎంపికైన వారిని అభినందించారు.

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ



హెల్మెట్ ధారణపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: జరిమానా తప్పించుకోవడానికో, పోలీసుల కోసమో కాదు, భద్రత, భవిష్యత్తు కోసం వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని భీమవరం ట్రాఫిక్ సీఐ జి.దాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌ఆర్‌ఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో శ్రీవిజ్ఞాన వేదిక, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించండి – సురక్షితంగా ప్రయాణించండంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని తద్వారా ప్రమాదాల కొని తెచ్చుకోవద్దన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రతి ఏటా వందల మంది మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రక్షణ కవచంగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కళాశాల నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రసూన, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, అరవిందస్వామి పాల్గొన్నారు.